# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-04-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **సింగపూర్‌లో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ మంత్రుల బృందం ప్రజా సమస్యల పరిష్కారానికి అక్కడ అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేసింది.**
2. **వ్యర్థాల నుంచి సంపద సృష్టితో పాటు, ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రాధాన్యమని ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**
3. **తెలంగాణలోని సింగరేణి సంస్థ నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు.**
4. **ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోందని గనుల శాఖ మంత్రి మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**
5. **వాతావరణ సమస్యలపై దృష్టి సారించే ఉద్దేశ్యంతో ఈ రోజు ధరిత్రీ దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

==========================

సింగపూర్‌లో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ మంత్రుల బృందానికి అక్కడి ప్రజా సమస్యల పరిష్కార విధానాలపై సింగపూర్ విదేశాంగ, వాణిజ్య శాఖల మంత్రి గాన్ సియో హువాంగ్ నిన్న వివరించారు. స్థానిక సమస్యలను వేగంగా పరిష్కరించే మీట్-ది-పీపుల్ సెషన్-ఎంపీఎస్ విధానం గురించి సమగ్రంగా తెలియజేశారు. ప్రతి వారం తమ నియోజకవర్గాల్లో మీట్-ది-పీపుల్ సెషన్లు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కరించే విధానాన్ని సింగపూర్ ప్రజాప్రతినిధులు అనుసరిస్తున్నారని తెలిపారు.

--------------------------

వ్యర్థాల నుంచి సంపద సృష్టించడంతో పాటు, ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రాధాన్యమని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ తో కలిసి మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం రామానాయుడు మాట్లాడుతూ, పాలకొల్లులో 5 కోట్ల రూపాయల వ్యయంతో ఆధునిక వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పాలకొల్లులో డంపింగ్ యార్డుల్లో ఉన్న చెత్తను తొలగించి, తడి-పొడి వ్యర్థాలను వేరు చేసి సంపద వనరులుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలుపుతూ...

వాయిస్..25.. సెకన్లు

---

తెలంగాణలోని సింగరేణి సంస్థ ఉత్పత్తి వ్యయం, బొగ్గు విక్రయ ధరలు తగ్గించి, నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. దేశవ్యాప్తంగా బొగ్గు సంస్థల పనితీరుపై ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. దేశంలోని బొగ్గు వినియోగదారులు తమకు నచ్చిన చోట నచ్చిన గ్రేడు బొగ్గును పొందే విధంగా నేషనల్ కోల్ ఎక్స్ఛేంజి ద్వారా అమ్మకపు విధానాన్ని ప్రవేశపెడుతున్నామన్నారు. ఉత్పత్తి వ్యయం తగ్గించుకునేందుకు, మార్కెట్లో నిలదొక్కుకోవడానికి సింగరేణి సంస్థ నాణ్యమైన బొగ్గును తక్కువ ధరకు విక్రయించేలా కృషి చేయాలన్నారు. కొత్త గనులను చేపడుతూ నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని కిషన్ రెడ్డి సూచించారు.

---

రాష్ట్రవ్యాప్తంగా వెనుకబడిన వర్గాల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ప్రకటించారు. అనంతపురంలో నిర్వహించిన విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంస్థ ఛైర్మన్, డైరెక్టర్ల సన్మాన కార్యక్రమంలో ఆమె నిన్న పాల్గొన్నారు. బీసీల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్పొరేషన్లకు త్వరలోనే నిధులు విడుదల చేయనున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ...

వాయిస్..30.. సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్యులు విజయవంతంగా నిర్వహిస్తున్నారని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ తెలిపారు. తెనాలి ప్రభుత్వాసుపత్రిలో ఇద్దరు ప్రమాద బాధితులకు క్లిష్టమైన ఆపరేషన్లు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన మరో ఇద్దరు మహిళలకు ఆర్థో వైద్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన శస్త్రచికిత్సలు విజయవంతమయ్యాయని ఈ మేరకు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ యాదవ్ వైద్య బృందాన్ని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాలు, సౌకర్యాల వల్లే ఇటువంటి శస్త్రచికిత్సలు చేయగలుగుతున్నారని మంత్రి తెలిపారు.

---

ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోందని గనుల శాఖ మంత్రి మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ఆయన నిన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి విభాగాలను పరిశీలించి, రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఆసుపత్రిలో పారిశుధ్యం, భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మరిన్ని ఆధునిక సదుపాయాలతో ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని కొల్లు రవీంద్ర తెలుపుతూ...

వాయిస్ ..30..సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్ లో ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా చిన్న పరిశ్రమలు పనిచేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు –ఎంఎస్ఎంఈలపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించి శాఖ పనితీరు, అమలులో ఉన్న పథకాల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, స్థానిక పరిశ్రమల అభివృద్ధికి ప్రతి నియోజకవర్గానికి ఒక ఇండస్ట్రియల్ ప్రమోషనల్ అధికారిని నియమించాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ ద్వారా ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకీ తీవ్రమవుతున్న వాతావరణ సమస్యలపై దృష్టి సారించే ఉద్దేశ్యంతో ఈ రోజు ధరిత్రీ దినోత్సవం–ఎర్త్ డే ని నిర్వహిస్తున్నారు. భూమి పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యల పట్ల అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. వాతావరణ కాలుష్యం, విచక్షణా రహితంగా అడవుల నరికివేత వంటి అంశాల కారణంగా పర్యావరణ సమతుల్యం దెబ్బతిని జీవ మనుగడకు ముప్పు ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో భూమి పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యల పట్ల అవగాహనా కల్పిస్తూ 1970 నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 22 వ తేదీన ధరిత్రీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. “మన శక్తి, మన గ్రహం” అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ధరిత్రీ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 133 వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 24వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఎండల తీవ్రత పెరిగిందని, వడగాలులు వీస్తున్నాయని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో అత్యధికంగా 44.4 డిగ్రీలు , ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 44.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించింది. ఈరోజు బుధవారం 76 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 134 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపింది.

తెలంగాణ మీద నుంచి రాయలసీమ వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

---------------------------

అత్యాధునిక వైద్య పరికరాల తయారీకి తెలంగాణాలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నెదర్లాండ్స్ దేశానికి చెందిన మెడిటెక్ పారిశ్రామికవేత్తలు, విశ్వవిద్యాలయాల పరిశోధకులతో ఆయన నిన్న సమావేశమైయ్యారు.

====================